# గుప్త సాలగ్రామం

జీవితం తిరగలి దిమ్మలాగో, రుబ్బురోలుపొత్రంలాగో చలనం లేకుండా, మార్పులేకుండా, చప్పగా చదికిలపడివుంటే ఎంత దుర్భరంగా వుంటుందో, ఎంత విషణ్ణంగా వుంటుందో ఆలోచించుకుంటూ బస్సులో ప్రయాణం సాగిస్తున్నాను.

సాహిత్యానికీ కాల వైపరీత్యానికీ సంబంధమున్నా లేకపోయినా వ్యవహారానికి మాత్రం అది పందొమ్మిది వందల నలభై నాలుగో సంవత్సరం. ఆ వేళ మహర్నవమి. అల్లుళ్ళంతా పండుగను మోసుకుంటూ ఆశల్ని పేర్చుకుంటూ, ఆనందాల్ని పేనుకుంటూ అత్తవారిళ్ళకు ప్రయాణం సాగిస్తున్నారు. దసరా పండుగ సరదాల కోసం లోకం అలసట లేకుండా అలంకరించుకుంటోంది.

మా బొగ్గుబస్సు సామర్లకోట వచ్చింది. ప్రయాణీకుల్ని దింపడం, మళ్ళీ ఎక్కించుకోడం అనేవి దాని బాధ్యతలే అయినప్పటికీ — కేవలం ఆపని నిమిత్తమే ఆగిందని చెప్పలేం. ఆగడం మట్టుకు బస్సుస్టాండులోనే జరిగింది. బొగ్గు మళ్ళీ వెయ్యడానికో, బూడిద తోడెయ్యడానికో, పాతమైను మరీ పాడవడంవల్ల మార్చేయడానికో — ఈవిధు లన్నిట్నిగాని లేదా కొన్నిట్నిగాని నిర్వర్తించడానికో ఆగిపోయింది. అరగంటకదిలి పోయినా కారుమాత్రం కదలడంలేదు. బస్సునేం చెయ్యదల్చుకున్నారో, మా ప్రయాణం ఏం కానుందో? బొగ్గు నలుసుల దుమ్ములోంచి దుర్భరమైన దుర్వాసనాపాశాల నుంచీ మాకెప్పటికేనా విముక్తి కలుగుతుందో లేదో వగైరా విషయాలను గురించి నేనాలోచించడంలేదు. ఈ సాదాసంగతుల గురించి అనవసరంగా ఆలోచించడం ప్రారంభిస్తే — నాకు తెలుసు; ప్రయాణం త్వరగా సాగాలనే ఆదుర్దా నన్ను రాసి రంపాన పెడుతుంది. అత్తవారింట్లో వున్న నా పెళ్ళాన్ని గురించిన ఆలోచనలు వేధిస్తాయని కూడా నాకు తెలుసు; ఆమె తెల్లని మల్లెపూల చిరునవ్వులూ, చిలిపి నునుసిగ్గు చూపుల మతాబాలూ — వగైరా అనేక విషయాల గురించి ఆలోచనల గాలి దుమారంలో, ఆందోళనా బంధాలలో — అమ్మమ్యో — నేను తట్టుకో గలనా? కాబట్టే ఇలాంటి తాకిక స్థితిగతుల్ని గురించి ఈషన్మాత్రమూ నేనాలోచించ దలుచుకోలేదు. అదీగాక థాయిస్‌కి నాహృదయాన్ని, నా మస్తిష్కాన్ని, నా రసజ్ఞతనీ

ఆసమయంలో నాకుగల సర్వస్వాన్నీ నైవేద్యం చేస్తున్నాను. అనటోల్ ఫ్రాన్సు మాయల మరాటీలాగ నన్ను గొలుసుతో బంధించి అనిర్వచనీయమైన ఏ ఆధ్యాత్మికానందంలోనో ముంచి తేలుస్తున్నాడు. బస్సులో కూర్చున్న ప్రయాణీకుల గొంతుల నుంచి వెలువడుతున్న కోలాహలం నుంచీ, కదలని కళేబరంలో పుడుతున్న దుర్వాసనల చిరాకునుంచీ, నేను సురక్షితంగా వుండటానికి కారణం—ఫ్రంటుసీటులో ఒంటరిగా కూర్చోవడ మేనా కావచ్చు, లేదా సద్గ్రంథ పఠనమేనా కావచ్చును.

ఏమైనప్పటికీ, థాయిస్ నాలో ఎక్కించిన మత్తుమందు మోతాదు హెచ్చడంవల్ల కాబోలు చదవడం ఆగిపోయింది. చదవటం మానటంతోటే మెదడులో రంగురంగుల కాగితం చక్రాలేవో గిరగిర తిరగ నారంభించాయి. అప్పటి ఆలోచన వివరాలన్నీ ఇప్పుడు చెప్పడం నాతరంకాదు; కాని ఒక్కటి మాత్రం స్పష్టంగా అనుకున్నాను: జీవితం మారకుండా వుండ టం ఎంత దుర్భరమో—మార్పు కలిగించబోయే విలక్షణాల్ని ముందుగానే తెలుసుకోడం కూడా అంత దుస్సహమేకదా! అని. ఎంచాతనోగాని ఒకరకమైన వైరాగ్యంతో కూడిన తత్వం కూడా నాలోంచి చొచ్చుకొచ్చింది. అంతా మన ప్రయోజకత్వమే అనుకుంటాం; కాని— యేమిటో సమయంవస్తే మనం ఏమీ చేయలేం. జీవనప్రవాహం దాని యిష్టంవచ్చినట్టు అది పోవా ల్సిందే. యింతకీ మనమంతా భయంకరమైన ఇనుప చక్రం

పళ్ళకి తగులుకుని వేలాడుతున్న అల్పమైన గడ్డిపరకలం మాత్రమే! అనుకున్నాను. నిరాశగా నిట్టూర్చాను.

అర్థంలేని ఆలోచనల వరవడి వల్లనే కావచ్చు — నాకు వెంటనే విసుగుపుట్టింది. నా చుట్టూవున్న భౌతిక పరిస్థితులపై ఒక్కసారిగా అసహ్యంకలిగింది. తలుపు తెరుచుకుని కారు దిగాను. ఊసుపోక అటూయిటూ తిరుగుతున్నాను. కారు వెనుక కాలచక్రాన్ని క్లీనర్ కుర్రాడు శక్తివూనించి వడివడిగా తిప్పుతున్నాడు. మంటలు పుట్టించేంత తీవ్రంగా సూర్యుడు ప్రకాశించడం లేదు. మబ్బుకమ్మింది, సన్ననిగాలి తెమ్మెరలు చల్లగా వీచుతున్నాయి. సేదతీరుస్తున్నాయి. మట్టిగోడ వెనుక నున్న పెద్ద చింతచెట్టు కొమ్మల్లో కూర్చొని, గోరువంకలజంట ఏదో మాట్లాడుకుంటోంది. కొంపతీసి నా భావి గురించిగాని సంభాషించుకోవడం లేదుకదా? అయినా పక్షుల భాషతెస్తే ఎంత బాగుండును!

ఎంత దురదృష్టవంతుణ్ని!—ఇంతసేపటినుంచీ చూడనే లేదు. వెనుక సీటులో-చాలామంది స్త్రీలతోపాటు కూర్చున్న ఒక యువతి, ఎంత అందంగావుందో—నేను కాదుగదా, అనటోల్ ఫ్రాన్సు కూడా వర్ణించలేడు. ఆమె నాకేసే రెప్పవాల్చకుండా చూస్తోంది. నేనావేళ పొందిన అదృష్టాల్లో అదే ముఖ్యమైనది. కళ్ళజోడు తీసి శుభ్రంగా తుడుచుకున్నాను. రుమాలుతో ముఖం బాగా తుడుచుకున్నాను. స్పష్టంగా

చూశాను. వసంతంలో శరీరమంతా పూవులతో అలంకరించుకుని— వికసించిన చిగురుపువ్వులతో ఠీవిగా నించునే తురాయి చెట్టులాగుందామె! సాంఘిక నీతికి భిన్నంగా సంచరిస్తున్నాననే జ్ఞానమైనా లేకుండా ఆమెవైపు తదేక దీక్షతో చూస్తున్నాను. అలా నిశ్చేష్టుణ్నయిన నాలోని ఒక భాగం— ఈమె సౌందర్యంతో నా భార్య సౌందర్యాన్ని పోల్చి, తూకంవేసి చూస్తోంది. ఈ రస చర్చ యిలాగే సాగితే, ఎంతటి ప్రమాదాలు సంభవిస్తాయో అనే భయంతో నా హృదయాన్ని నిగ్రహించుకున్నాను. వేగంగా పోయి సీటులో కూర్చున్నాను.

నిజం చెబుతున్నాను. నా భౌతికదేహం పరిమాణ పూర్తిగా నా స్వాధీనంలోనే వుంది. కాని— నా ఆంతరంగిక దేహంమాత్రం ప్రమాదకరంగా నాలోంచి ఎగిరిపోయింది. తురాయిచెట్టు నీడల్లో ఆడుకుంటోంది. వికసించిన కుసుమాలను తెరిమి తన మెడలో అలంకరించుకోవాలని ఉవ్విళ్ళూరుతోంది. తోచక ఒకసారి బుర్ర ఎత్తాను. తెరుచుకుని ఆవలిస్తున్న పుస్తకంలోకి మళ్ళీ తొంగిచూశాను. కాని, సరిగ్గా అదే సమయంలో నాకళ్ళజోడు ప్రక్కనుంచి ఏదో ఆకృతి కదులుతోందని వెంటనే గ్రహించాను. నిజమే; కళ్ళు విప్పి స్పష్టంగా పరకాయించాలి!

*   *   *

# 2

ముఖం చూశాను. బహుశా అరవై ఏళ్ళు నిండిన వృద్ధుడు. అసమాన తేజస్సును కుమ్మరిస్తున్నాయా కళ్ళు. సౌమ్య శీతల దృష్టుల్ని వెలిగిస్తున్నాయి. ఆ విశాల నేత్రాంచలాలలో భవుతిక ప్రపంచానికి సంబంధించిన విషాదానుభూతుల కెరింతలు తృళ్ళింతలాడుతున్నాయి. ఒత్తుగా పెరిగిన జీబురు గడ్డంలోంచి కనిపించీ కనిపించని చిరునవ్వు; తుమ్మలతోపు వెనుక వెలిగే తటిల్లతలాగుంది. ఆరని పిపాస, తీరని జిజ్ఞాసల అసంతృప్తిని ఆ నుదుటి రేఖలు ద్యోతక పరుస్తున్నాయి. తలపై జిలిబిలిగా చీదరించివున్న కేశాలు... ఎడారి మధ్య ఒయాసిస్సులాగ, చిట్టడవిమధ్య సరోవరంలాగ స్వీయానుభవ జన్య జ్ఞానాన్ని స్పష్టీకరించే చిన్న బట్టతల. చిరిగి విశీర్ణమైన అతని బట్టలు చూసినా, జీర్ణమైన శరీరాన్ని చూసినా— చిరునవ్వుల కవకాశమూ, ఆస్కారమూ కనిపించడం లేదు. కాని ఆ పరస్పర వ్యత్యాసమే నన్ను అమితంగా ఆకర్షించింది. ఎంచాతనో త్వరలోనే వివశుణ్ణి చేసింది.

నేను తన్ను చూస్తున్నానని గ్రహించాడు. చిరునవ్వుతో, ఒడిదుడుకుగా పోతున్నాడు. ఎందుకో వెంటనే పిలవాలనిపించింది. తెలుగు ముఖం కానట్టు స్పష్టపడుతోంది. ఏమని పిలవడం ! "దాదా ! ఇదరావ్ జీ!" అన్నాను. ఆగాడు. వెనక్కి తిరిగి క్షణమాలోచించాడు. నిబ్బరంగా

నడిచి నాదగ్గరకు చక్కా వచ్చాడు. ముఖం పరిశీలించాను. మాట్లాడ్డాని కేముంది? తెలీదు. కాని, మాట్లాడాలి. ఆ కను పాపల్లో ఏదో ప్రేమ, మానవత్వాన్ని తొణికిసలాడించే ఆద రణ. భ్రూమధ్యలో తాండవిస్తున్న నిస్పృహ. చూపులలో తారట్లాడుతున్న నిరాశ. తాపీగా పడుతున్న అడుగులలో నిర్లక్ష్యత— పరిభ్రమిస్తున్న చిరునవ్వుల్లో కరుణ; అందరికీ కనిపించే ఆ వ్యక్తిలో అందరికీ కనిపించని లక్షణాలు మాత్రమే యివి. ఆ విలక్షణాల కలయికే నాకు మాట్లాడే ధారుఢ్యాన్నీ చనువునీ ప్రసాదించింది.

"ఎందుకా తొందర?" అని ప్రశ్నించాను.

"జీవితమే తొందరలో ఇమిడి వుంది. బ్రతుకంతా హడావిడిగా, అతిత్వరగా తెల్లారిపోతుంది నాయనా!" అన్నా డతను. అతని పరిహాసం భౌతిక వీధుల్లోనే ప్రతిధ్వనించింది. కాని అతని అంతరాత్మ మాత్రం విహాయసంలో తేలిపోతోంది ఉజ్వలంగా వెలిగిపోతోంది. పారలౌకిక లోకాలలో వూగు లాడుతోంది.

నా అభిమానం గాయపడ్డది. ఇంకేమడుగను? శూన్యత నా కనుల్లో ప్రతిబింబించింది. హిందూస్తానీలో నవ్వుతూ ప్రశ్నించాను. "మీకు తెలుగు తెలుసునా? అని.

తోచక అడిగిన ఆప్రశ్నకు విలువేమీ లేదని భావించా డల్లేవుంది; "తెలుగు తెలియడాని కేముంది? కొంచంగా

తెలుసు'' అన్నాడు. విలాసంగా నవ్వుతూ తెలుగులోనే జవాబిచ్చాడు.

నన్ను అవమాన పరచినా సహిస్తాను. అంతేగాని నా మాతృభాషను తేలికజేసి ఈసడిస్తే సహించగలనా? అందులోకీ ఉత్తరాదివాడు; దాదా అయితేనేంగాక, అతని పద్ధతి చూస్తే అసహ్యం వేసింది. నిజం చెప్పాల్సివస్తే ఆ వరస నాలో కొంచం భయం కలిగించింది. అందువల్లనే కాబోలు గౌరవం కూడా హెచ్చింది. ఇంకా మాట్లాడాలనిపిస్తోంది. ఏం మాట్లాడడానికి తోచదు. తేలని ఆలోచనల తడుముల్లాటలో ఒకనిముషం గడిచిపోయింది. ''మీ దేదేశం!'' అన్నాను. చివరికి.

"నాయనా! నీదేదేశమో చెప్పగలవా? నువ్వు పుట్టిన మట్టే నీదేశ మనుకుంటున్నావా? ఈ విశాల ప్రపంచమంతా నాదే. నాది అనే ప్రదేశమే లేనివాడికి లోటేమిటి బాబూ! వెళ్ళిరానా?'' అన్నాడతను.

అతని ధోరణిచూస్తే నాకు ఒళ్ళు మండింది. అడిగిన దానికి సూటిగా సమాధానం చెప్పక ఏమిటా బుర్రతిరుగుడు? దేన్ని చూసుకుని అంత గర్వం? అయినా క్షమ ఉత్తమ ధర్మమనే పెద్దల మాటల్లో నమ్మకమున్నవాణ్ని కావటంవల్ల ఓర్మి పట్టాను. అతను మాట్లాడుతున్నంతసేపూ నా చూపు లతని కన్నులనుంచి పెదాలవరకూ ప్రయాణం చేస్తూనే ఉన్నాయి.

నా వేషభాషల్లోని భేషజాన్ని చూసి అసహ్యించుకుంటున్నా డేమో! అప్పటి నా ఊహాలకి కొలతబద్దలులేవు. అతని ముఖ వర్చస్సులో మహాజ్ఞాని కనిపిస్తున్నాడు. అతని ఆర్ద్రనయనాల్లో విరహి తొంగిచూస్తున్నాడు. అతని జీవిత విధానంలో ఏకాకి ద్యోతకమవుతున్నాడు. నిర్భాగ్యుల జీవిత రహస్యాలెన్నో వ్రాసిపెట్టిన పుస్తకమేమో అతని జీవితం...ఏదో మాట్లాడా లనే ఆదుర్దా; కాని సనుకులేదు. ఏదైనా ఇస్తే: – గ్రహిస్తాడో లేక తిరస్కరిస్తాడో ననేభయం. ఏందారి? కనుల లోతుల్లోకి చూస్తూ పర్సుతీశాను.

"దాదా! దీన్ని తీసుకుని పళ్ళుతీసుకోండి!" అన్నాను. పళ్ళు తీసుకోమన్నమాట వతినేవ్రాతపదంగా అన్నాను. మాట సబబుకి మాత్రమే అన్నాను. నిజానికి, అతను నేనిచ్చినదాన్ని గంజాయికే వినియోగించుకున్నా నాకేమీ బాధ్యతలేదు.

అతను వికాసంగానవ్వాడు: "పర్మాత్మ!" అనుకుంటూ చేయిజాపాడు.

బస్సు వెనుక చక్రపు బరబరలు ఆగిపోలేదు. డ్రైవర్ కండక్టర్లు ఎక్కడికి వెళ్ళారో కనిపించరు. కారులో ప్రయాణీ కుల బడలిక తాలూకు రణగుణధ్వనులు, చంటిపిల్లల విధీ విరామం లేని ఏడ్పులు, వృద్ధుల నిరుత్సాహ పూరితమైన నిట్టూర్పులు, వాతావరణంనిండా తీరని అశాంతి వ్యాపించింది. ఘనీభవించిన ఆందోళన వినిపించింది. చప్పున కారు దిగాను.

మదురుగల మట్టిగోడకి ఆనుకుని నించున్నాను. అతనికీ నాకూ వున్న అంతర్యం—చిత్రం; నేను కారులోవున్నా, క్రిందికి దిగినా ఒక్క పరిమాణంలోనే వుంది. మట్టిగోడ వెనుక చింత చెట్టుమీద గోరువంకలు నిశ్చింతగా వూసులాడుకుంటూనే వున్నవి. అతని ముఖాన్ని బహిరంగంగా చూస్తున్నప్పటికీ, అడపా తడపా వెనుక సీటులోని అపూర్వసుందరిని దొంగ చూపులతో స్పర్శిస్తూనే వున్నాను. అతను నాకు సన్నిహితంగా రావడం గుర్తించాను.

"నాకు మీతో ఎన్నో మాట్లాడాలనిపిస్తోంది. కాని ఏం మాట్లాడ్డానికీ తోచదు. జీవితం కల్పించే సందేహాలను మీ నుంచి నివృత్తి చేసుకుందామనేవుంది కూడా! నిజానికి..' అని అసంపూర్తిగా వాక్యాన్ని ముగించాను. నేనా సమయం లో అన్నమాటల అర్థం ఇదే అనేభావంతో మూడు పంక్తులు రాశానే గాని ఆ మాటల్ని వెలువరించడానికి మాత్రం ఎంత కాలహరణం జరిగివుంటుందో చెప్పలేను.

మాటల వెనుక నా గుండెల్లో చెలరేగుతున్న జిజ్ఞాసను త్వరగానే గ్రహించాడతను. సాలోచనగా కళ్ళు తిప్పుతూ అన్నాడు; "నేను చెప్పవలసిందేముంది నాయనా! ఈ ప్రపంచమే మనందరికీ పాఠాలు నేర్పుతోంది. మొండివాళ్ళు నేర్చుకో డానికి తిరస్కరిస్తారు. బుద్ధిమంతులు ఇట్టే గ్రహిస్తారు. అంతే తేడా! కాని ఒక్క విషయం మాత్రం మరిచిపోకు.—ఏదో దృగ్గోచరం గాని సాంఘిక సూత్రంతో కట్టబడిన ఆట బొమ్మ

తప్పితే మానవుడు మరేమీ కాదేమో అనిపిస్తుంది. ఏమం టావు నాయనా! మరి సెలవిస్తావా?'' అన్నాడు దాదా. విని కిడికీ ప్రాతికిమధ్యగల అఖాతంలో ఎన్ని ఉత్తమ విషయాల వివ రాలు పూడ్చుకుపోయాయో తెలియదు. కాని దాదా మాత్రం నేను వ్రాయకలిగిన దానికంటే ఎక్కువగానే మాట్లాడాడనేది అక్షరాల నిజం. ఆ మాటలతోనే అనుకుంటాను. దాదాపై నాకుగల గౌరవం ఇతోధికమైంది. అపారమైన అభిమానం జనించింది. నిర్హేతుకమైన ప్రేమ పొడసూపింది. ఏదో ఆత్మీయ మైన ఆనంద తరంగం నా గొంతును పూడ్చి నులిపెడుతోంది. అనర్గళంగా వేగంగా మాట్లాడ్డం ప్రారంభించాను.

''నమస్కారం దాదా! నన్ను త్వరలోనే మరిచిపో గలుగుతావు; నాలాంటి మనుషుల్ని తరుచు చూస్తానే వుంటావు కాబట్టి. కాని, నేనీ జన్మలో నిన్ను మరిచిపోలేనను కుంటాను.'' అన్నాను. నిజం చెబుతున్నాను—ఏదో మాట వరుసకన్న శుష్కప్రియాలు మటుకు కావు. అతని ముఖంలో ఏముందో సరిగా చెప్పలేను. కాని నా హృదయంలో మాలిన్య రహితమైన లోతుల్లోంచి ప్రతిధ్వనించిన శబ్దాలివి.

అతను వెంటనే గొంతు సవరించుకున్నాడు. కంగారుగా మాటందుకున్నాడు ''హ్హీహీ — నాలో ఏముంది నాయనా! అదంతా నీ మంచితనం కల్పిస్తున్న భ్రమతప్పితే మరేమీ కాదు.''

"అఁహఁ! అలాకాదు, నీ పేరేమిటో, నీవేదేశస్థుడవో కొంచం వివరంగా చెప్పాలి. తప్పదు" అన్నాను. మాటల్ని యెంతవేగంగా పలువరించగలనో, అంతవేగాన్ని ఈ వాక్యాల కోసం వినియోగించాను. అతని చిరునవ్వు మౌనం వహించింది నాకు మాట్లాడ్డానికి ఏమీ కనిపించలేదు. పైగా అతని మౌనాన్ని—కాదు ఆలోచనా సమాధిని భంగపరచ దలుచుకో లేదు. '...కన్పిస్తున్న భ్రిమతప్పితే—' అనే వాక్యం హిందూ స్తానీలో యెంత అందంగా అన్నాడో తెలుగులో చెప్పలేను. ఆ వాక్యాన్నే పదేపదే మననం చేసుకుంటూ, బస్సులోని అప్సరకన్యని వీలుచిక్కి—నప్పుడల్లా ఆదమరిచి వీక్షిస్తూ మధ్య మధ్య రాని కారుడ్రైవర్ గురించీ, స్టార్టుగాని కారుగురించీ వ్యర్థంగా ఆలోచిస్తూ, దాదా జీవితచ్ఛాయల్ని మనో నేత్రంతో దర్శిస్తూ—మౌనంగా నిశ్చేతనంగా నించున్నాను. నిమిషాలు గడుపు తున్నాను.

* * *

## 3

"ఐతే చెప్పమంటావా నాయనా! నా విషాధకథ కొద్ది మందికైనా తెలియదు. అందులోకీ అపరిచితమైన ఆంధ్రి దేశంలో బొత్తిగా నే" అన్నాడు.

"అఁ చెప్పు దాదా?" అన్నాను. ఒణుకుతూ ఒడి దుడుగ్గా అన్నాను. దయాసాగర తరంగాలు ఉజ్వలిస్తున్న

ఆ కనుల్లో చెప్పాలన్న కోర్కె స్పష్టంగా కనిపించింది. జీవిత సంఘర్షణలో నలిగి కగ్గిపోయిన అతని చెంపలు ధైర్యాన్ని విరజిమ్మాయి. అతని ముఖవర్చస్సుపై క్షణకాలం విషాద ఛాయ లలముకున్నాయి.

''నా జీవిత చిత్రాన్ని వినాలనివుందా? వ్రినాయనా సరే—కాని, నువ్వు నాకేదో ఇచ్చినందువల్ల మాత్రం నేనీ విషయాలు చెప్పడంలేదు. నీ ముఖంచూస్తే చెప్పాలనిపిస్తోంది. నిన్నుచూస్తే నా కొడుకు జ్ఞప్తికి వచ్చాడు. వాడికిప్పుడు నీ వయస్సే వుంటుంది.'' అన్నాడు. కంఠాన్ని కుదించాడు. అతని కన్నులు మౌనంగా ఆక్రందిస్తున్నాయి. చెమ్మగిల్లాయి. కాని పెదవులపై చిరునవ్వు చెరగలేదు. వినాలనే కుతూహలంతో, నూటిగా చూస్తున్నాను. అతని జీవిత కథనుగురించి అంచనాలు వేస్తున్నాను. మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు. ఈ మాట మాత్రం స్వీయకథా సంగ్రహంలోకే రావడం నా అదృష్టం.

''మాది బీహారు. స్వస్థలం చిన్నపల్లెటూరు. నాకు వివాహం చిన్నప్పుడే అంటే పదహారేళ్ళకే అయిందిలే—నా భార్య మేనమామ కూతురే. చిన్నతనంనుంచీ మేముభయులం ఎంతో ఆప్యాయతతో పెరిగాం. యవ్వనం తొందర పెట్టిన క్షణంనుంచీ ఎడతెరిపిలేని ప్రేమతో ఒళ్ళు తెలియకుండా కాలం గడిపాం. ఉందాలేదా అనేవిచారం ఎన్నడూలేదు. నా

ముసలితల్లి పోరుమీద మా వూరి వీధిబడిలో మేష్టరికి కుదిరాను. ఇంగ్లీషుతో పరిచయం వుండడంవల్లా వంగభాష బాగాచదువు కున్నందు వల్లనూ నా వుద్యోగం త్వరలోనే దొరికింది. జీతం పాతిక రూపాయలిచ్చేవారు'' అన్నాడు దాదా. ఎందుకోగాని ఒక్కసారిగా ఆపాడు.

నడుస్తున్న అతని జీవితంలో గడచిపోయిన ఘట్టాల్ని నెమరు వేసుకుంటున్నట్టుగా అతని ముఖకళలు మారుతున్నాయి భార్యతో, జీతంతో, జీవితంతో అంత సంతృప్తిగా కాలం గడుపుతున్నప్పుడు ఈ దేశదిమ్మరి వృత్తిని ఎందుకు స్వీకరించి నట్టు? అతని ముఖంలో అంత విచారం క్రిమ్మడానికి కారణం ఏమిటి చెప్మా! ఏమైనా అతనిది విచిత్రమైన జీవితంలాగుంది. ఏవో ఆలోచనల భారంతో ఆందోళన చెందుతూ సిగరెట్టు వెలిగించాను. దాదా చూపులనుంచి నాదృష్టి మరల్చుకునే అవకాశం ఏర్పడినపుడల్లా అపూర్వ సుందరిని పరిశీలించడం మానలేదు. విపరీతమైన కాంక్షతో వూహాల అంచులలో తేలుతూ అసురుచిర మూర్తిని ఆలింగనం చేసుకుంటూనే వున్నాను.

''ఉద్యోగం దొరకడంతోటే మా దరిద్రకాలం అస్త మించింది.'' దాదా కథనం కొనసాగించాడు. ''సరిగ్గా ఒక్క ఏడాది గడిచిందో లేదో—పాపం, నాముసలి తల్లి కాలధర్మం చెందింది. రోజులు గడవని దరిద్రంలో నన్ను కవచంలాగ

సాగింది. సౌఖ్యదినా లాసన్నమౌతున్న సమయంలోనే ఆమె చనిపోయింది.

“దాచుకునే అవసరంలేని వయస్సు కనుక, నేనూ–నా భార్య కూడా ఆనందంగా కాలాన్ని వ్యయపరిచే వాళ్ళం. అయితే ఎక్కువ కాలాన్ని గ్రంథ పఠనానికి కూడా వినియోగించే వాళ్ళం. మా దాంపత్యం చూసి, నా భార్య సుగుణాలు చూసీ లోకం వేనోళ్ళ కొనియాడేది. ఆశీర్వాద ఫలితంగానే– మా అమ్మ చనిపోయిన ఏడాదికే నా భార్య కొడుకును కన్నది. నెల వంకలా ఎంతో అందంగా వుండేవాడు పసిపాప. మేమిద్దరం వాణ్ని దైవప్రసాదంగా చూసుకునే వాళ్ళం.

“నా జీవితమంతా కళారాధనకు వినియోగిద్దామని తహతహలాడేవాణ్ని. ఆ రోజుల్లో కవిత్వం వ్రాసేవాణ్ని. ‘అమృతగంగ’ అను కావ్యం కూడా వ్రాశాను. చిత్రలేఖనం చేసేవాణ్ని. చాలా బొమ్మలు అమ్మేశాను. నా జీవితం మీద నాకెంతో విశ్వాసముండేది. ఈ ప్రపంచానికి నేను చేయవలసిన కార్యాలెన్నో వున్నవనే ధైర్యంతో గర్వించేవాణ్ని. ఈ విధంగా సాగుతున్న నా జీవితానికి నా ఉద్యోగానికి కూడా మూడేళ్ళు నిండాయి. ఆ సమయంలోనే, అకస్మాత్తుగా నా జీవితం సాయంత్రానికిచేరుకుంటోందనే సత్యాన్ని తోపించాడు పరమాత్ముడు ?” అన్నాడు దాదా.

తలవని తలంపుగా అతని వాక్ప్రవాహం ఆగిపోయింది. వెలవెలబారుతున్న అతని ముఖాన్ని నిశ్చలంగా చూస్తూవుండి పోయాను. తరువాత ఏంకానుందో, జీవితం సాయంత్రానికి చేరుకోవడమేమిటో ఏమీ అర్థంకాలేదు. కాని అతని జీవిత కథలోని సుఖాంతమైన అధ్యాయం ముగిసిందని మాత్రం అవగాహనైంది. కాలం తన రంగు మార్చుకుంటోంది. ఎదురుగా ఉన్న సైకిల్‌షాపు యజమాని తనదగ్గర పనిచేసే కుర్రవాణ్ని గట్టిగా కొడుతున్నాడు. ఆ కుర్రాడు — పాపం, భీకరంగా అరుస్తున్నాడు. మొర్రోమని ఏడుస్తున్నాడు. ఎడమపక్క రోడ్డుమొగలో రెండు కుక్కలు మహాభయంకరయుద్ధంసాగిస్తున్నాయి. కారు మామూలుగానే—కదలని జీవచ్ఛవంలాగ ఉచ్ఛ్వసిస్తోంది. నా సహ యాత్రీకురాలైన అందాలరాణి పైటచెంగుతో ముఖం తుడుచుకుంటోంది.

* * *

# 4

దాదా తనజీవితవృత్తాంతాన్ని సంగ్రహంగానైనప్పటికీ హృద్యంగా చెప్పుకుపోతూనే వున్నాడు. జీవిత మహానాటకంలో ఈ దాదా ఒక యదార్థపాత్ర కావడంవల్లనూ, కృతకత్వమూ, కుత్రిమత్వమూలేని సజీవవ్యక్తి కావడంవల్లనూ అతని కథనంలోని ప్రతిహంశమూ ఉజ్వల శక్తితో నాళాంతరాళాలలోకి దూసుకుపోతోంది. చింతచెట్టుపై పలుకులాడుతున్న గోరువంకలు క్షణం మౌనం వహించి, దాదా కథ పట్టిపట్టి

వింటున్నాయి. దూర దిగంతాలలోని వృక్షాలు సహితం తల లాడిస్తున్నాయి. నాకు సమీపంలోవున్న రావిచెట్టు నునులేత చిగురు కెంజేతులాడిస్తూ, జాలిగా నిట్టూరుస్తోంది. గొంతును మంద్రస్థాయిలోకి కుదించి, బ్రతుకు బాధని తెలుపుకుంటు న్నాడు. ముఖం వంచుకున్నాడు. చెమ్మగిల్లిన అతని నేత్ర ద్వయం ఆషాఢమేఘంలాగ భారంగావుంది. అతను నాకళ్ళకు కట్టినట్టు ప్రదర్శించిన సాయంత్రం చేరుకున్న జీవిత చిత్రమిది?

దేశమంతా కరువుకాటకాలతో కులకుల లాడుతున్న రోజులవి. జీవితం జాడ్యాలతో మాడిపోతోంది. ప్రతిరోజూ వేలకువేల మరణాలు. బీహారు దేశమంతా అంటుజాడ్యాలతో తల్లడిల్లిపోయిన గడ్డుకాలంనాటి మాట! ప్రపంచ యుద్ధం మహా దారుణ ఫలితాల్ని భూమికి కల్పించి, ముగిసి ఎన్నో రోజులు కాలేదు. దేశం దారిద్ర్యంనుంచి కోలుకోలేదు. నలు మూలలా అలజడి. మానవసమాజాన్ని శాసించే వికృతమైన అశాంతి. మృత్యువు విజృంభించి వికటాట్టహాసం చేస్తోంది. రణం చల్లారినా మరణం నశించనేలేదు. ఇది ఆనాటి సంగతి.

మహాజన సాగరంలో ఒక బిందువైన దాదా జీవితాన్ని సైతం కౌగిలించకుండా జాడ్యం విడుస్తుందా? అతని భార్యకీ కొడుక్కీ కూడా అంటుకుంది. జబ్బు దిగజారుతుందనీ బ్రతికి బట్టకడతారనీ నిమిష నిమిషానికీ ఆశ హెచ్చరిస్తూనేవుంది. అయినా విధివిపరీతమైన మోసం జరిపింది. దాదా జీవితంనుంచి

కాంతిరేఖలు నిష్క్రమించాయి. ఎంత ఆత్మవిశ్వాసమూ మనః స్థయిర్యమూ గల మానవుడైనా రాక్షసత్వం తనకు శక్యం కాకుండా విజృంభించి జయించేసరికి నిస్సహాయంగా బేజారై వలవలా ఏడుస్తాడు. కర్మకో, విధికో బలహీనంగా తలవాల్చి లొంగిపోతాడు. అలాంటి దుస్సహ క్షణాల్లో తనకు చేతనైనది రవ్వంతైనా లేదనే అపనమ్మకంలోకి దిగజారిపోతాడు. ధీరులూ, కర్మవీరులు అయిన మానవులవిషయం ఎలాఉన్నప్ప టికీ దాదా సందర్భంలో మాత్రం అపజయం విస్పష్టంగా తన ప్రతిఫలాన్ని నిర్మించుకుంది.

ఈ ఘట్టాన్ని చెబుతున్నప్పుడు దాదా గట్టిగా నిట్టూర్చాడు. "ఇంకేముంది? దిక్కులేని పక్షినైపోయాను" అన్నాడు. అతని కళ్ళలో ఘూర్ణిల్లుతున్న విచార సముద్రపు లోతులు అప్పుడతిస్పష్టంగా కనిపించాయి. చూస్తూ చలనం లేకుండా ఉండడం దుర్భరమైంది. నా కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. సులోచనాలు తీసి జేబురుమాలుతో తుడుచు కున్నాను. అంతకన్నా నేను మాత్రం చేయగలిగిందేముంది? అతను నావైపు సాలోచనగా జూశాడు, కాని అతని జీవిత కథనం ఆగిపోలేదు.

నిజమే మరి— జీవితంలోని వెన్నెల పూర్తిగా వెలిసి పోయిందనే నిశ్చయమున్న మనిషికి ఉద్యోగమెందుకు? సంపాదన దేనికి? దాదా బడిపంతులు వృత్తికి తిలోదకాలర్పిం

చూడు. ఇల్లమ్మమన్నాడు. సంసారానికి సంబంధించిన ఐహిక లక్షణాల్ని త్యజించాడు. ఆ సమయంలోనే అతని చిన్న మేన మామ వచ్చి ఛడామడా తిట్టాడు. "ఎవరైతేమాత్రం ఏం చేయగల్గరు? దైవనిర్ణయం అలావున్నప్పుడు-" ఆపదకాలంలో ధైర్యంగా వుండటం ఉత్తమ పురుషలక్షణం—చిన్నవాడివి నా మాట వినరా బాబూ!" అన్నాడు చిన్న మేనమామ. తన కుమార్తెను పెళ్ళిచేసుకుని ఒక యింటివాణ్ని కమ్మన్నాడు.

కాని దాదా అతని మాటలేమీ లెక్కచేయలేదు. పైగా మండిపడ్డాడు. 'బుద్ధిః కర్మానుసారిణీ' అని పెద్దలు వక్కా ణించినట్టు—అతని జీవితంలో సన్యాసయోగం వుంటే ఎవరు ఏంచెప్పిమాత్రం ఏంలాభముంది? ఆ రాత్రే—అతనికి చెప్ప కుండానే, దేశాటనం బయల్దేరాడు.

పుట్టిన గ్రామం వదిలి దేశాటనానికి బయల్దేరేడేగాని దాదా దగ్గిర ఒక వందరూపాయలు తప్పితే మరేమీలేవు. మిగతాడబ్బంతా బీదల ఆరోగ్యంకోసం ఖర్చుపెట్టమని వ్రాసి బ్యాంకులో పడేశాడు. ఆడబ్బుమీద అధికారాన్ని స్నేహితు డైన పెద్దమనిషికి అప్పగించాడు. అంతే! ఆరాత్రే! తన జీవిత గగనంనుంచి కాంతిరేఖలు విరమించి కనీసం నెలరోజులైనా గడువకముందే;—కన్నూ మిన్నూ కనిపించని కారుచీకటిలోనే- విశాలమైన దేశంలోకి ప్రస్థానం సాగించాడు. కాని ఎక్కడికి? ఏమీ తెలియదు. అలాంటి నిశాధ్వాంతంలో సిద్ధార్థుడు

ఎక్కడికని బయల్దేరాడు. ఏమాశించి బయల్దేరాడు? ఉత్తమ లక్ష్యాన్ని ఆశించిన మహనీయులంతా అలాంటి సమయంలోనే ఇల్లువిడిచి వెళ్ళిపోతారు కాబోలు?

దేశం నలుమూలలా చూడాలనీ, సర్వతీర్థాలనూ సేవించాలనీ, పుణ్యక్షేత్రాలను దర్శించాలనీ—ఉబలాటం తప్పితే మరేమీలేదు. ఉత్తరదిశలో—పర్వతాల చలి మలువుల్లో అనేక దినాలు గడచి వెళ్ళిపోయాయి. కాశీలో—గయలో—ప్రయాగలో—ద్వారకలో—ఇలాగే, దినాలు మాత్రం ఒక్కలాగే! హృదయంలో తీరని అశాంతి. తీవ్రమైన పిపాస మనస్సులో గుబులుకునే ఆవేదన. దేశమంతా—కాలమంతా—దాదాచుట్టూ గిరగిరా తొందరగా తిరిగిపోతోంది. కాని మిగిలినది ఒక్కటే సంతృప్తి; గతంలో, గృహస్థజీవితంలో పుస్తకాలు జ్ఞానోదయాన్ని కలిగించేవి. కాని ప్రస్తుతం తను పర్యవేక్షిస్తున్న జీవితమే, అనుభవ పూర్వకంగా అనేక వినూత్న విషయాలను నేర్పుతోంది.

పాపం, దాదా! పాతిక సంవత్సరాల నిండుప్రాయాన్ని బైరాగి ధర్మానికి సంతృప్తిగా త్యాగం చేశాడు. సజీవ సౌందర్యాలను చూసి ముగ్ధుడయేదాదా—మాతృదేశం నుంచి జ్ఞానాన్ని సముపార్జించాలనే హృదయ సంస్కారంగల దాదా లోకంలోని వికారాన్నీ విషాదాన్నీ, అమానుషత్వాన్నీ ఈషన్మాత్రమైనా సహించలేని కళాహృదయంగల దాదా—ఈ

సన్యాస వృత్తినుంచి ఏ సముజ్వల కాంతి నాశించాడు-? ఏమిటీ సంతృప్తి ? ఇంతశ్రమా దేనికోసం ? ప్రేమించి, సర్వస్వాన్ని అర్పించి ఆరాధించే స్త్రీ మూర్తి మరణించడమే ఇంత మార్పుకీ కారణమా ? సౌందర్య లక్షణాలో-ఉత్తమగుణాలో వ్యక్తుల పరస్పర ప్రేమకు ఆస్కారమవుతాయి కదా ? జీవిత ముడిపదార్థాన్ని పరిశోధించి హృదయ పూర్వకమైన ప్రేమకు పాత్రమైన మరో వ్యక్తి మళ్ళీ సంపాదించుకోవచ్చును కదా ! అయితే, దాదాకి-ఈ విలక్షణత్వం, ఈ వైరాగ్యం ఎందు కుదయించినట్టు మరి ?

ఏమో ! ఈ సమస్యలన్నిటినీ నాతలపై వేసుకోవడం, గిరగిరా తిరిగి దిగబడి కూరుకుపోవడం, మంచిది కాదని ఆలోచించడం మానేద్దామని వెంటనే నిశ్చయించుకున్నాను.

బస్సు కదిలే ప్రయత్నానికి చేరువాతోంది. వెనుకవైపు ఫుట్‌బోర్డుమీద నించుని కండక్టర్ తాపీగా బీడీ కాల్చుకుంటున్నాడు. స్త్రీ ప్రయాణీకుల్లో కూర్చున్న లావణ్యవతిబద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. ఆవలించి చిటిక వేసింది. మెటికలు విరుస్తోంది. కదలని బస్సుతో ప్రయాణీకుల ప్రాణాలు విసిగి వేసారిపోతున్నాయి. నాకుమాత్రం ఆలస్యమైపోతోందన్న ఆందోళన కలుగలేదు. నా మనోనేత్రంలో అనిశ్చిత జీవనప్రాంతాలు మెల్లగా నిబ్బరంగా బడలికగా కదలిపోతున్నాయి.

* * *

# 5

"చిన్నప్పటినుంచీ అజంతా ఎల్లోరాల దివ్యశిల్పాల గురించి అనేక అమూల్య విషయాలు వింటూ వచ్చాను". దాదా జీవితాన్ని వినిపిస్తూనే ఉన్నాడు. మధ్య మధ్య తెలుగు నుపయోగించినా ప్రధాన భాగాలన్నీ హిందూస్తానీలోనే చెప్పుకుపోతున్నాడు.

అజంతా ఎల్లోరా! మానవ శ్రమశక్తి ఎంతటి ఉత్తమత్వాన్ని సృష్టించగలదో ఎంతటి శాశ్వత అమరత్వాన్ని ప్రసాదించగలదో నిరూపించే కాంతికళలు! కళాహృదయంగల ప్రతి మనిషికీ ఆ మాధుర్యాన్ని రుచి చూడాలనే తహతహ సహజమైనదే! అంచాతనే దాదా ఆ పవిత్ర స్థలాలకు పయనం సాగించాడు. దారిలో ప్రతిచోటా జీవితాన్ని పరిశీలిస్తూ ఆనందాన్ని పీలుస్తూ బయల్దేరాడు. ఎన్ని రోజులున్నాడో, మహదానందాన్ని ఎంతగా అనుభవించాడో తద్వారా ఎలాంటి అసమాన విజ్ఞానాన్ని సేకరించుకున్నాడో చెప్పడానికి లోక వ్యవహారంలోని కొలమానాలు నిరుపయోగమవుతాయి. కాని దేశాన్ని కలయచూద్దామనే ఆసక్తి సన్నగిల్లలేదు. నాల్గుదిక్కులా అవధులవరకూ యాత్ర సాగించాడు. అంతమాత్రంలో అనంత జీవితయాత్ర పరిసమాప్తి కానేలేదు.

"సంవత్సరంలోని ఆరునెలలు అజంతాలోను ఆరు నెలలు ఎల్లోరాలోనూ గడచిపోతుండేవి. ఈవిధంగా సుమారు ఇరవై సంవత్సరాలు పునరావృతిలేని గతంలో కలిసిపోయాయి. నా ఆశయం సఫలీకృతమయింది. పరమాత్మ నా జీవితాన్ని పవిత్రీ మొనరించాడు. నేను చూడకుండా మిగిలిపోయినది, ఒక్క ఆంధ్రదేశం మాత్రమే? ఆ లోటు భర్తీ చేయడానికే ఈ నాలుగేళ్ళనుంచీ తిరుగుతున్నాను. ఓపినంతలో ప్రతి మారు మూలా వదలకుండా చూస్తున్నాను" అన్నాడు. దాదా గొంతులో స్వర్గద్వారాల గంటలు గలగల ప్రతిధ్వనించాయి. ఆశయసిద్ధి కలిగించిన సంతృప్తి అతని నేత్రాలలో శాశ్వత కాంతిగా ప్రకాశించింది. దాదా నిజంగా ధన్యజీవి!

"మా దేశం ఎలావుంది దాదా?" అన్నాను. 'ఏ దేశ మేగినా ఎందు కాలిడినా!' అనే కవి సమయాల సాంప్రదాయంలో జన్మించినవాణ్ని కావడంవల్ల మన దేశాన్ని పొగిడితే విని సంతోషిద్దామనే ఉద్దేశంతో ప్రశ్నించాను.

"చక్కని దేశమే గాని ప్రజలు రానురాను మూర్ఖత్వం వల్ల స్వార్థచింతలో పడిపోయారని తోస్తోంది. అంటే దాన ధర్మాలు చేయని పిశాచాలని నా ఉద్దేశం కాదు. అయినా ఏ మనిషిమీదా నాకు కోపంలేదు" అన్నాడు దాదా. అతని ప్రతి మాటలోనూ ప్రతిచేష్టలోనూ ఆధ్యాత్మికమైన సౌశీల్యత రసపారవశ్యత, స్పష్టంగా గోచరించేవి. దాదా కథ వింటు న్నంతసేపూ ఏవో ఔన్నత్య శిఖరాల కెగబ్రాకినట్టుగా—

కాంతిపుంజంలాగ గాలిలో తేలిపోతున్నట్టుగా— అసంఖ్యాక మైన మానవులంతా నా దృష్టిలో పిపీలికలై పోయినట్టుగా— ఏదో విచిత్రమైన అనుభూతి నన్నావహించింది. అయినా ఏవేవో సందేహాలు నా దేహంచుట్టూ విక్రమిస్తూనేఉన్నాయి. కొన్ని నివృత్తి పొందినవీ— కొన్ని ప్రకటనకే అనర్హమైనవీను. అన్నిటికన్నా ముఖ్యమైనది— దాదా తిండిసమస్య నన్ను తీవ్రంగా బాధించ నారంభించింది.

"ఏం దాదా— ఇన్ని రోజులనుంచీ నీకు తిండి ఎలాగ గడుస్తోంది?" ఉండబట్టలేక ప్రశ్నించాను.

దాదా ఫక్కున నవ్వాడు. 'ఏముంది బాబూ— నీబోటి వాళ్ళెవరేనా పెడితే తినడం— లేకుంటే ఏమూలనో కాళ్ళు ముడుచుకుని పడుకోవడం, అంతే!" అతి సునాయాసంగా అన్నాడు.

తేలికగా అనేశాడేగాని అతని జవాబుతో నా మనస్సు చివుక్కుమన్నది. 'ఎంత తెలివితక్కువ ప్రశ్న— అన్నీ తెలుసున్న వాడిలా కనిపిస్తున్నావ్— ఇంతేనా?" అన్నట్టుగా అతని ధోరణి వినిపించింది. అంతమాత్రంలో నేనేమీ వెనుకంజ వేయలేదు. మళ్ళీ గొంతు సర్దుకున్నాను;

"సరే— తరువాత నీ ప్రయాణం ఎక్కడికి?" అని మరో ప్రశ్న వేశాను. "దేశాటనం పూర్తికావచ్చింది కదా— మళ్ళీ స్వదేశం వెళ్ళిపోతావా?" అన్నాను.

అదోలాగ చూశాడతను. 'నాకు స్వదేశంలో ఏముంది నాయనా ? నా అనేవాళ్ళయినా ఎవరు మిగిలారు!' అన్నాడు. పశ్చిమాకాశపు జేగురురంగు మబ్బులతనికి కళ్ళల్లో ప్రతిబింబించాయి. పుట్టినప్పుడు మనతో ఎవ్వరూ రాలేదు. చనిపోయేటప్పుడుకూడా మనతో పుచ్చిన వక్కైనా రాదు అనే వేదాంత వాక్యం నా లోపలి చెవులో మారుమోగింది. దాదా గొంతు సవరించుకున్నాడు. "మళ్ళీ అజంతాకి వెళ్ళిపోతాను. నా శేషకాలం అక్కడే పూర్తి చేస్తాను" అన్నాడు.

భీరుత్వమూ, ఐహిక సుఖైక వాంఛల బలహీనతలతని హృదయానికీ, కంఠానికీ ఎన్నోమైళ్ళ దూరంలో నిర్వీర్యమై తలక్రిందులా వ్రేలాడుతున్నాయి. అతన్ని చూస్తున్నంత సేపూ ఎంచాతనోగాని— ఒక్కవిషయం నా గుండె మారు మూలలనుంచి వినిపిస్తూండేది. ఏమైనా జీవితం క్షణప్రభ కానేకాదు. దివ్య ప్రభా సమన్వితమైన కాంతిలహరి! ... జీవితం వేసవి ఎండలకు హరించిపోయే సెలయేరు కానేకాదు— సజీవంగా, చైతన్యవంతంగా ఉరకలువేస్తూ ప్రవహించే అమృత నది !

" నా విషాద చరిత్ర నాతోనే అంతం కానియ్యి— నన్ను మరిచిపో, సెలవు బాబూ !" అన్నాడు దాదా. నూతి లోంచి వెలువడిన గొంతులాగ వినిపించింది.

అతను చెప్పినదాంట్లో లవలేశమైనా శ్లేష లేదు. అయినా నాకు తన్ను మరిచిపోవద్దనే హెచ్చరికలాగమాత్రమే ధ్వనించింది. పూడుకుపోయిన కంఠాన్ని బలవంతంగా పెగుల్చుకున్నాను! "నీ పేరు చెబుతావా దాదా ?" అన్నాను.

"పేరులో ఏముంది నాయనా? నువ్వడిగావు కాబట్టి చెప్పక తప్పదు; నన్ను పూర్వం ద్విజేంద్ర ప్రసాద్ అనే వారు. కాని ఇప్పుడు నాకు అదీ మిగలలేదు. సెలవు బాబూ!" అన్నాడు. ఎంత వైరాగ్యంగా మాట్లాడుతున్నప్పటికీ— దురదృష్టవశాత్తూ అతని గొంతులో ఏదో సంతృప్తి విస్పష్టమైంది.

ఏదో ఆలోచిస్తున్నాను; బహుశా—దాదా అజంతాలో ఏం చేస్తూవుంటాడో అనే విషయంగురించేనా కావచ్చు; లేదా— ఇన్ని సంవత్సరాల పరిశీలనా ఫలితంగా మా మానవ జాతికి ఎంతటి ఉత్కృష్ట కళాఖండాలు ప్రసాదితమైతాయో అనే నా ఆశగురించేనా కావచ్చు; లేదా— ఆమధ్య అజంతా నుంచి తిరిగివచ్చిన ఒక మిత్రుడు చెప్పినదాన్నిబట్టి అతనక్కడ చూసిన కళాతపస్వి ఇతను కాదుగదా అనే అనుమానం గురించేనా కావచ్చు; ఏదైనప్పటికీ ఆలోచిస్తూ పరధ్యానంలో పడ్డం ఖాయం. అంచాతనే దాదాని ఆఖరిసారిగా మరోమారు చూడ్డం పడలేదు. అతనికి మరికొంచం అధికంగా సహాయం

చేయడానికి అవకాశం చిక్కలేదు. అప్రియత్నంగా "నమస్కారం!" అని మాత్రం అనగలిగాను, దాదా వెంటనే "పరమాత్మకో!" అన్నాడు. శరవేగంగా వెళ్ళిపోయాడు.

నన్ను నేను శూన్యంగా చూసుకున్నాను.—చేతిలోని పుస్తకం బోసినోటితో వెలవెల్లాడుతోంది. నిష్ప్రయోజకంగా నన్నుచూసి నవ్వుతోంది. చుట్టూ చూస్తున్నాను. — అనేక మంది మనుషులు — బుర్రగోక్కుంటున్నవాళ్ళు, పిచ్చాపాటీ మాట్లాడుతున్నవాళ్ళు, గోళ్ళు గిల్లుకుంటున్నవాళ్ళు కనిపిస్తున్నారు. అయినా ఆ స్థలమంతా నిర్మానుష్యంగానే తోచింది. ఒక్కటే ఆలోచన మెరుపులాగ తళుక్కుమంది. వెంటనే బయల్దేరాను. దాదాని కల్సుకోవాలి; మరికొంత సహాయం చేయాలి. వెదుకుతూ వడివడిగా అడుగులు జారుస్తున్నాను. దాదా మాత్రం కనిపించడం లేదు.

ఎదురుగా ఎవరో దృఢకాయుడు; దుబ్బ కట్టిన మీసాలు, చెవులకు తమ్మెట్లు; వత్తుగా ఊర్ధ్వ పుండరాలు, గుండ్రంగా కత్తిరించిన తల; నల్లటి మనిషి, ఎదురైన వెంటనే ఆగి అడిగాను.

"నేను చూళ్ళేదు. ఎవడో ముష్టాణ్ని గురించి నాకేమవసరమయ్యా?" అన్నాడు దృఢకాయుడు. ఈసడింపు చూపులు నా మీదికి విసిరాడు.

మూర్ఖజనం! బాహ్య స్వరూపాల్నిబట్టి వస్తుతత్వాన్ని పరిగణించే దుర్దశ తొలగిపోతేనేగాని ఈ జాతికి ముక్తిలేదు— అనుకున్నాను మనసులో; పైకి ఏమీ అనలేదు.

దాదాని మళ్ళీ కలుసుకోవాలనే ఆందోళన అధికతరం కాజొచ్చింది. కాని కలసిరాలేదు. బస్సుడ్రైవరు కసిగాహారన్ మోగిస్తున్నాడు. కారు ఆరోగ్యం బాగుపడిందనే సంగతి ఖచ్చితంగా తెలుస్తోంది. కాని, ఆ తపస్వి మళ్ళీ కనిపించలేదు. భారంగా, శూన్యంగా వెళ్ళాను. బస్సును సమీపించాను, నా సీటులో చదికిలబడ్డాను. కాని దాదా ఆత్మ నన్ను వెంటాడ్డం మానలేదు. తేజోవంతమైన ఆ నేత్రాలే సాక్షాత్కరించాయి. దృష్టి మరల్చుకుందుకు వెనకసీటులోని లతాంగిని పరికించి చూశాను. ఆమె ఏదో ఆలోచిస్తోంది, నావైపు చూసీ చూడ్డంతోనే—ముఖవళికల్లో ఉబ్బెత్తుగా మార్పు రావడం ఎందువల్లనో నాకు తెలీదుగాని విచిత్రంగానేవుంది.

పశువులిళ్ళకు వెళ్ళిపోతూ బస్సుగమనానికి అడ్డం వస్తున్నాయి. మనదేశపు రోడ్లకు జన్మహక్కయిన దుమ్ము రేగుతోంది. ఒక పొగరుమోతు కోడిగిత్త మరో గిత్తమీదికి హుషారుగా ఎక్కింది. రెండూకలిసి కారుముందుకు దూకుడుగా వచ్చేశాయి.

బస్సు పూర్తిగా డ్రైవర్ స్వాధీనంలోనే ఉండటంవల్ల మరేమీ విపరీతాలు జరగలేదు. కారు గట్టిగా వూపిరిపీల్చు

కుని వేగం హెచ్చించింది. ఊళ్ళుగడుస్తున్నాం, ఏర్లు దాటే స్తున్నాం, కాలంకూడా వడివడిగా కారుచక్రాల్లోంచి కారి పోతోంది. నల్లని చీకటితెరల కీనీడలు రోడ్డుమీద బస్సుమీద మనుషులమీద సమాన ఫాయిలో పరుచుకుంటున్నాయి.

కారు గమనంతోపాటు—నా ఆలోచనా ప్రవాహం దాదా గురించి...తురాయి పువ్వుల ఎర్రని అందంగురించి, దారిలో కనిపించిన దృఢకాయుడి సౌకుమార్యం గురించి, అత్తవారింటిని గురించి, నా పెళ్ళాం చిరునవ్వుల మల్లెపూల గురించి సౌందర్య కిరణాలు వెదజల్లే ధాయిస్ గురించి, ఒకటేమిటి?—రేగిన నిప్పురవ్వలవంటి ఆలోచనలు! లోచనాలు తెరచి జీవన్మరణ సంఘర్షణను తిలకించే ఆలోచనలు!

ఏమైనా — దాదాని జాంబవంతుడు శమంతకమణిని దాచుకున్నట్లుగా నా హృదయ కుహరంలో పదిలంగా గుప్త పరుచుకున్నాను. ఇంతకీ మనుషులంతా మహా భయంకరమైన అయోమయ చక్రిదంతాలకు తగుల్కొని నిస్సహాయంగా వ్రేలాడుతున్న గడ్డిపోచలు మాత్రమే!'' అనుకున్నాను.

గమ్యస్థలం చేరటంతోటే బస్సు నన్ను దింపేసింది. అత్తవారిల్లు చేరుకున్నాను. గదిలో కీనీడలో గాజులు కణకణ మని మ్రోగుతున్నాయి. తెల్లని నవ్వుల పలకరింపులు నన్ను కవ్విస్తున్నాయి. కాని వెంటనే నా లోపలి నిస్సహాయత పలి

కింది : 'అగోచరమైన ఏ సూత్రానికో బంధించబడి ఏదో శక్తి ఆడించినట్టు ఆడే కీలుబొమ్మలం తప్పిస్తే మనమంతా మరేమీ కానేకాదేమో !' అని.

ఏమైనా దాదా మాత్రం—నా హృదయ కుహరంలో జాజ్వల్యమానంగా ప్రకాశించే శాశ్వత సత్యం.

[ప్రచురణ : జ్యోతి మాసపత్రిక]